నేటి నిజం

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 1-9-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 25 | పేజీలు:4 | వెల: రూ.1/-

ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రిని అభినందించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్

హైదరాబాద్ , ఆగష్టు 31: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల చీఫ్ కమిషనర్ పార్థసారథిని మంగళవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా నియమితులైన ప్రొఫెసర్ లింబాద్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వీరిరువురూ గతంలో తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్ఛాన్స్?లర్, రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన వారే కావడం గమనార్హం

ఆఫ్ఘనిస్థాన్‌లో పరిస్థితిపై అత్యున్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగష్టు 31:ఆఫ్ఘనిస్థాన్‌లో జరుగుతున్న పరిణామాలపై దృష్టి సారించడానికి ఓ అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు ప్రధాని నరేంద్ర మోదీ. ఇందులో విదేశాంగ మంత్రి జైశంకర్‌తోపాటు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ కూడా ఉన్నారు.

ఈ కమిటీ ఆఫ్ఘనిస్థాన్‌లో భారత్ తక్షణ ప్రాధాన్యతలపై దృష్టి సారించనుంది. ప్రస్తుతానికి ఆ దేశంలో ఇంకా చిక్కుకుపోయిన భారతీయులను సురక్షితంగా తిరిగి తీసుకురావడానికి ఇండియా ప్రాధాన్యత ఇస్తోంది. గత రెండు దశాబ్దాల్లో ఆఫ్ఘనిస్థాన్‌లో ఇండియా భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టిన విషయం తెలిసిందే. ఆ దేశానికి పార్లమెంట్ భవనాన్ని కూడా నిర్మించి ఇచ్చింది.

ఈ కమిటీ కొన్ని రోజులుగా సమావేశమవుతోంది. అక్కడి భారతీయులను సురక్షితంగా తీసుకురావడంపై, ఇండియాకు వస్తున్న ఆఫ్ఘన్ జాతీయులపై, ఇండియా లక్ష్యంగా ఆఫ్ఘనిస్థాన్ నుంచి ఎలాంటి ఉగ్రవాదానికి తావు లేకుండా ఉండటంపై చర్చిస్తోంది అని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆఫ్ఘన్‌లో తాలిబన్ల పాలనపై భారత్ వేచి చూసే ధోరణిలో ఉంది. అక్కడి పరిణామాలపై భద్రతా మండలి ప్రకటనతోపాటు అంతర్జాతీయ సమాజం ఎలా స్పందిస్తున్నది కూడా నిశితంగా పరిశీలిస్తోంది.

రేపటి నుంచి పాఠశాలల్లో ప్రత్యక్ష తరగతులు.. ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్ , ఆగష్టు 31:రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను తెరువాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెసిడెన్షియల్, సాంఘి సంక్షేమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ పాఠశాలలు మినహా మిగతా పాఠశాలలను కొవిడ్ నిబంధనల మేరకు తెరిచేందుకు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తరగతులకు అనుమతి ఇచ్చింది. ప్రత్యక్ష బోధనపై విద్యార్థులను పాఠశాలలు బలవంతపెట్టొద్దని ప్రభుత్వం ఆదేశించింది. ఆన్‌లైన్, ప్రత్యక్ష బోధన అంశంపై పాఠశాలలదే నిర్ణయమని పేర్కొంది. పాఠశాలలు అనుసరించాల్సిన విధివిధానాలను రూపొందించాలని ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు ఆదేశాలిచ్చింది. అలాగే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఎస్ఓపీలపై విస్తృత ప్రచారం కల్పించాలని సూచించింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో విద్యాశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు.

తెలంగాణలో మరో మూడు రోజులు వానలు

హైదరాబాద్ , ఆగష్టు 31:రాష్ట్రంలో వానలు భారీగా కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఇప్పటికే గత రెండు రోజుల నుంచి భారీ వర్షాలు పడుతుండడంతో పలు జిల్లాల్లో జనం అవస్థలు పడుతున్నారు. తాజాగా మరో మూడు రోజులు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. విదర్భ, మధ్యప్రదేశ్ ప్రాంతంలో అల్పపీడనం బలహీనపడిందని చెప్పింది. అల్పపీడనానికి అనుబంధంగా ఆవర్తనం కొనసాగుతున్నది. సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనం ఉన్నది. వీటి ప్రభావంతో రాగల మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

మంగళవారం ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని, పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వాన పడే అవకాశం ఉందని పేర్కొంది. ఇవాళ్టి ఉదయం వరకు నిర్మల్, కామారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో 11 సెంటీమీటర్లకుపైగా వర్షాపాతం నమోదైంది. నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, హన్మకొండ, మహబూబాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వాన కురిసింది. పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడ్డాయని టీఎస్‌డీపీఎస్ వివరించింది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా 9 మంది ప్రమాణం

న్యూఢిల్లీ, ఆగష్టు 31: లింగ సమానత్వానికి ఇదో చారిత్రక ఉదాహరణ. ఇవాళ సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ముగ్గురు మహిళా న్యాయమూర్తులు ఒకేసారి ప్రమాణ స్వీకారం చేయడం చరిత్రాత్మకం. మొత్తం 9 మంది సుప్రీం జడ్జిలుగా ఇవాళ ప్రమాణం చేసిన విషయం తెలిసిందే. మహిళా జడ్జీలుగా ప్రమాణం చేసినవారిలో జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ బెలా ఎం త్రివేదిలు ఉన్నారు.

ఈ ముగ్గురి చేరికతో సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తుల సంఖ్య నాలుగుకు చేరింది. సుప్రీంకోర్టులో మొత్తం 33 మంది జడ్జీలు ఉన్నారు. ఇప్పటి వరకు సుప్రీంకోర్టు చరిత్రలో మహిళా జడ్జీలుగా 11 మంది పని చేశారు.

తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఉన్న జస్టిస్ హిమా కోహ్లీకి సుప్రీంకోర్టు జడ్జీగా పదోన్నతి కల్పించారు. 2006లో ఢిల్లీ హైకోర్టు అడిషనల్ జడ్జిగా ఆమె బాధ్యతలు చేపట్టారు.

ఆ తర్వాత ఏడాది పర్మనెంట్ జడ్జి అయ్యారు. ఈ ఏడాది జనవరిలో తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు. సుప్రీంకోర్టులో ఆమె న్యాయమూర్తిగా 2024, సెప్టెంబర్ 2 వరకు ఉంటారు.

భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి ఈఎస్ వెంకటరామయ్య కుమార్తె జస్టిస్ బీవీ నాగర్నత. కర్నాటక హైకోర్టు సీజేగా ఉన్న ఆమె.. అన్నీ అనుకూలిస్తే 2027లో భారత తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ ఆమె బాధ్యతలు స్వీకరించినా.. కేవలం 36 రోజులు మాత్రమే ఆ విధుల్లో కొనసాగే అవకాశం ఉంది.

గుజరాత్ హైకోర్టుకు చెందిన జస్టిస్ బెలా ఎం త్రివేది.. సుప్రీంకోర్టు జడ్జిగా ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. 2011లో రాజస్థాన్ హైకోర్టు అడిషనల్ జడ్జిగా ఆమె బాధ్యతలు చేపట్టారు. 2016లో ఆమె మళ్లీ గుజరాత్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2003 నుంచి 2006 వరకు గుజరాత్ ప్రభుత్వానికి న్యాయ కార్యదర్శిగా చేశారు. 2025, జూన్ 10 వరకు జస్టిస్ బెలా త్రివేది సుప్రీం జడ్జిగా ఉంటారు.

తాలిబన్ నేతతో భారత రాయబారి చర్చలు..

దోహా, ఆగష్టు 31:: ఆఫ్ఘనిస్తాన్‌ను ఆక్రమించేసిన తాలిబన్లతో ఇవాళ భారత్ చర్చలు జరిపింది. దోహాలో తాలిబన్ల నేతతో భారత రాయబారి మాట్లాడారు. ఉగ్రవాదంపై ఆయన ఆందోళన వ్యక్తం చేసినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. ఆఫ్ఘన్ భూభాగంలో ఉగ్రవాదుల కదలికలు ఆందోళనలు కలిగిస్తున్నట్లు భారత రాయబారి వెల్లడించారు. ఖతార్ రాయబారి దీపక్ మిట్టల్.. తాలిబన్ల పొలిటికల్ ఆఫీసు అధిపతి షేర్ మొహమ్మద్ అబ్బాస్ స్టానిక్‌జాయ్‌తో ఇవాళ సంప్రదింపులు జరిపారు. దోహాలో ఉన్న ఇండియన్ ఎంబసీలో ఈ మీటింగ్ జరిగింది. తాలిబన్ల అభ్యర్థన మేరకు ఈ భేటీ జరిగినట్లు ఓ ప్రకటన ద్వారా వెల్లడైంది. ఆఫ్ఘనిస్తాన్‌లో చిక్కుకున్న భారతీయుల రక్షణ, భద్రత అంశం గురించి తాలిబన్ నేతతో దీపక్ చర్చించారు. భారతీయులను సురక్షితంగా తరలించేందుకు చేపట్టాల్సిన చర్యలు గురించి మాట్లాడారు. భారతీకు రావాలనుకుంటున్న ఆఫ్ఘన్ మైనార్టీల అంశం గురించి కూడా వారిద్దరూ చర్చించారు. ఆఫ్ఘన్ భూభాగాన్ని భారత వ్యతిరేక చర్యలకు, ఉగ్రవాద కార్యకలాపాలకు వాడకూడదని దీపక్ మిట్టల్ తాలిబన్లను కోరారు. ఈ సమస్యలన్నింటికీ సానుకూలంగా స్పందించనున్నట్లు తాలిబన్ ప్రతినిధి తెలిపారు.

పార్టీ జెండా పండుగను ఘనంగా నిర్వహిద్దాం : కేటీఆర్

హైదరాబాద్ , ఆగష్టు 31: సెప్టెంబర్ 2న జరిగే పార్టీ జెండా పండగను ఘనంగా నిర్వహిద్దాం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాలలోని వార్డుల్లో పార్టీ జెండాను ఎగురవేసి పార్టీ కార్యక్రమాలను ప్రారంభించాలని కోరారు. ఇవాళ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ రాష్ట్ర కార్యవర్గం, పార్టీ సర్పంచులతో కేటీఆర్ టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు పార్టీ సంస్థగత నిర్మాణంపైన కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.

సమన్వయంతో ముందుకెళ్లాలి..

సెప్టెంబర్ రెండో తేదిన జరిగే పార్టీ జెండా పండగ కార్యక్రమానికి గ్రామ, వార్డులో పరిధిలో పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరూ వచ్చేలా సమాచారం అందించి సమన్వయం చేసుకోవాలన్నారు. అదే రోజు ఢిల్లీలో పార్టీ కార్యాలయ భవనానికి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. దీంతో పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు ఆ కార్యక్రమానికి హాజరవుతారు. ఈ క్రమంలో స్థానిక నాయకత్వం పార్టీ జెండా పండుగ విజయవంతానికి కృషి చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ ఇంఛార్జిలు, సీనియర్ నాయకులు సమన్వయం చేసుకోవాలని సూచించారు.

ఈ జెండా పండగ తర్వాత కమిటీల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించాలని కేటీఆర్ సూచించారు. సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 12వ తేదీ వరకు గ్రామపంచాయతీలు, వార్డు కమిటీల ఏర్పాటు చేయాలన్నారు. సెప్టెంబర్ 12 నుంచి 20వ తేదీ వరకు మండల, పట్టణ కమిటీల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. సెప్టెంబర్ 2 వ తేదీ తర్వాత జిల్లా కార్యవర్గాల ఎంపిక, జిల్లా అధ్యక్షుల ఎంపికను స్థానిక ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర నాయకత్వం సమన్వయం చేసుకొని ప్రకటిస్తుందని కేటీఆర్ తెలిపారు. జిల్లా కార్యవర్గాల ఎంపిక తర్వాత రాష్ట్ర కార్యవర్గాన్ని పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటిస్తారని కేటీఆర్ తెలిపారు. జిల్లా అధ్యక్షులు, నూతన జిల్లా కార్యవర్గాలను పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమన్వయం చేసుకుని ప్రకటిస్తారన్నారు.

పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఉన్నవారికే కమిటీలో చోటు

పార్టీ కమిటీల కూర్పు విషయంలో కేటీఆర్ పలు సూచనలు చేశారు. పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వారికే ఈ కమిటీలలో చోటు ఉంటుందన్నారు. పార్టీ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కచ్చితంగా 50 శాతం ఉండాలని, లేకుంటే అయా కమిటీలు చెల్లవన్నారు. పార్టీ అనుబంధ కమిటీలతో పాటు గ్రామ, మండల స్థాయి పార్టీ సోషల్ మీడియా కమిటీ ఏర్పాటుకు సూచనలు చేశారు. ముందుగా మండల కమిటీలు పూర్తి చేసిన తర్వాతా గ్రామ స్థాయి సోషలు మీడియా కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని కమిటీల్లో మహిళా కార్యకర్తలకు తగిన చోటు కల్పించాలని కేటీఆర్ సూచించారు.

హైదరాబాద్ నగర ప్రత్యేక సమావేశం

హైదరాబాద్ నగర విస్తృతి, జనాభా, ఇక్కడి పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యేక నగర సమావేశం ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. నగరంలో బస్తీ కమిటీ, డివిజన్ కమిటీలను ఏర్పాటు చేస్తామని, ఈ కమిటీల ఏర్పాటులో నగర ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గ ఇంఛార్జిలు, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, రాష్ట్రస్థాయి నాయకత్వం ఈ విషయంలో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోతారన్నారు. సెప్టెంబర్ తొలి వారంలో హైదరాబాద్ నగర ప్రత్యేక సమావేశం ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు.

ఎల్ఎండీ 12 గేట్లు ఎత్తివేత.. దిగువకు 64వేల క్యూసెక్కుల విడుదల



తిమ్మాపూర్, ఆగష్టు 31:: ఇటీవల కురుస్తున్న వర్షాలకు దిగువ మానేరు (ఎల్ఎండీ) జలాశయంలోకి రిజర్వాయర్‌లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు 12 గేట్లను ఎత్తి 64,332 క్యూసెక్కుల నీటిని దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా, ప్రస్తుతం గత మూడు రోజులుకు కురుస్తున్న భారీ వర్షాలతో మోయతుమ్మెద వాగు నుంచి 40,184 క్యూసెక్కులు, మిడ్ మానేరు నుంచి 24,748 క్యూసెక్కులు, పరీవాహక ప్రాంతం నుంచి 1200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది.

ఎల్ఎండీలో పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 22.918 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు. రిజర్వాయర్‌లోకి 66,132 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 12 గేట్లు ఎత్తి 64,332 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. కాకతీయ కాలువ ద్వారా 1500 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 300 క్యూసెక్కులు ఔట్ ఫ్లో ఉన్నది. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరిగితే మరిన్ని గేట్లు తెరువనున్నట్లు తెలిపారు.

సెప్టెంబర్ 2న ప్రతి పల్లె, పట్టణంలో గులాబీ జెండా ఎగరాలి : మంత్రి సత్యవతి

హైదరాబాద్ , ఆగష్టు 31: సెప్టెంబర్ 2న రాష్ట్రంలోని ప్రతి, పల్లె, పట్టణంలో గులాబీ జెండా గుండెలనిండుగా ఎగరాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో సీఎం కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. 20 సంవత్సరాల కిత్రం జలదృశ్యం నుంచి కేసీఆర్ నేతృత్వంలో గుప్పెడు మందితో కలిసి ఒక్క అడుగుతో ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర సమతి ప్రస్థానం.. 20 ఏళ్ల విజయవంతమైన ప్రయాణంలో 2న ఢిల్లీలో పార్టీ కార్యాలయ శంకుస్థాపన సందర్భంగా సగర్వంగా టీఆర్ఎస్ గులాబీ జెండాను ఎగురవేయబోతున్నదన్నారు. ఒకప్పుడు ఏ అస్థిత్వం కోసం ఢిల్లీ వీధుల్లో తెలంగాణ సమాజం గుండె చప్పుళ్లు ప్రతిధ్వనించాయో.. ఇప్పుడు అవే వీధుల్లో మన ఆత్మగౌరవ పతాకం ఆకాశమంత ఎత్తుకు ఎగురబోతున్నదన్నారు.

2001లో ఉద్యమ పార్టీగా ప్రస్థానం ప్రారంభించి, ఉద్యమ లక్ష్యమైన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును సాధించడంతో పాటు ప్రజల అభిమానాన్ని పొంది సీఎం కేసీఆర్ నాయకత్వంలో పార్టీ రెండుసార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. గత ఏడేళ్లుగా సీఎం కేసీఆర్ పాలనలో బంగారు తెలంగాణ సాధనలో అనేక విజయాలు సాధించామని, దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని విధంగా సంక్షేమం, అభివృద్ధి పథకాలతో ముందు వరుసలో నిలిచిందన్నారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, తండాలు గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి తదితర పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సెప్టెంబర్ 2న పల్లెలు, పట్టణాలలో టీఆర్ఎస్ జెండా పండుగను ఘనంగా నిర్వనిర్వహించి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

ఈడీ విచారణకు హాజరైన పూరీ జగన్నాథ్



హైదరాబాద్ , ఆగష్టు 31:తెలుగు రాష్ట్రాల్లో టాలీవుడ్ డ్రగ్స్ కేసు ఎంత సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. గతంలో కొద్ది రోజుల పాటు ఈ కేసుకు సంబంధించి విచారణ జరగగా, ఇప్పుడు ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసును విచారిస్తోంది. ఇవాళ్టి నుంచి డ్రగ్స్ కేసులో ఈడీ విచారణ ప్రారంభం కానుంది. ఈరోజు నుంచి 12 మంది సినీ ప్రముఖులను విచారించనుండగా, తొలిరోజున దర్శకుడు పూరీ జగన్నాథ్ ఈడీ విచారణకి హాజరయ్యారు.

ఉదయం 10.30 గంటలకు ఆయన విచారణకు హాజరు కావాల్సి ఉండగా? 10.05 గంటలకే ఆయన వచ్చేశారు. ఆయనతో మాట్లాడేందుకు మీడియా ప్రతినిధులు ప్రయత్నించగా? పూరీ జగన్నాథ్ స్పందించలేదు. కారు దిగిన వెంటనే నేరుగా కార్యాలయంలోకి వెళ్లారు. మధ్యాహ్నం వరకు విచారణ సాగే అవకాశం ఉంది. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ఈడీ ఆఫీసులో నేటి నుంచి విచారణ ప్రారంభం కానుంది. జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలోని 8 మంది సభ్యుల టీం ప్రశ్నించనున్నారు.

ప్రస్తుతం పూరీ జగన్నాథ్ లైగర్ చిత్రంతో బిజీగా ఉండగా, ఆయన కొద్ది రోజుల క్రితం ముంబై వెళ్లారు. ఈడీ నోటీసులు పంపిన కారణంగా తిరిగి హైదరాబాద్‌కి వచ్చినట్టు తెలుస్తుంది. చివరిగా ఇస్మార్ట్ శంకర్ చిత్రంతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న విజయ్ దేవరకొండ ప్రస్తుతం విజయ్ దేవరకొండ హీరోగా లైగర్ అనే సినిమా చేస్తున్నాడు.

విచారణకు హాజరు కానున్న సెలబ్రిటీల విచారణ తేది:

1.పూరి జగన్నాథ్ – ఆగస్టు 31
2.ఛార్మి – సెప్టెంబర్ 2
3.రకుల్‌ప్రీత్ సింగ్ – సెప్టెంబర్ 6
4.రాణా దగ్గుబాటి – సెప్టెంబర్ 8
5.రవితేజ – సెప్టెంబర్ 9
6.శ్రీనివాస్ – సెప్టెంబర్ 9
7.నవదీప్ – సెప్టెంబర్ 13
8 ఎఫ్ క్లబ్ జీఎం – సెప్టెంబర్ 13
9.ముమైత్ ఖాన్ – సెప్టెంబర్ 15
10.తనీష్ – సెప్టెంబర్ 17
11.నందు – సెప్టెంబర్ 20
12.తరుణ్ – సెప్టెంబర్ 22

జెండా పండుగను విజయవంతం చేయండి : విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, ఆగష్టు 31:: సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 2న నిర్వహించనున్న జెండా పండుగను పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొని ప్రధాన కూడళ్ల వద్ద, వార్డులలో అంగరంగా వైభవంగా టీఆర్ఎస్ పార్టీ జెండా పండుగను ఘనంగా నిర్వహించాలని సూచించారు.

కొవిడ్ నిబంధనలను తప్పక పాటించాలని చెప్పారు. ఈ జెండా పండుగ ద్వారా పార్టీ సత్తా చాటి ప్రతి పక్ష పార్టీల నాయకులు తోకముడుచుకొని పోయేలా చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ కు తప్పా ఇతర పార్టీలకు చోటులేదని జెండా పండుగ ద్వార రుజువుచేయాలని పేర్కొన్నారు.

వ్యక్తిని హెలికాప్టర్‌కు కట్టి తిప్పారు..

కాందహార్ ,ఆగష్టు 31: ఆఫ్ఘనిస్తాన్ నుంచి అమెరికన్ దళాలు ఉపసంహరించుకున్న కొన్ని గంటల్లోనే అరాచకం రాజ్యమేలుతున్నదని చెప్పడానికి సాక్ష్యంగా వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఈ వీడియో ఆఫ్ఘన్ కాందహార్ నగరం నుంచి వచ్చినట్లుగా తెలుస్తున్నది. అమెరికాకు చెందిన బ్లాక్ హాక్ హెలికాప్టర్‌కు ఒక వ్యక్తిని కట్టి వేలాడి తిప్పినట్లుగా ఆ వీడియోలో కనిపిస్తున్నది. హెలికాప్టర్ గాలిలో తిరుగుతున్నంత సమయం దానికి వేలుడుతున్న వ్యక్తి అనేక ఇండ్లను ఢీకొంటూ వెళ్లాడం కనిపించింది.

చాలా మంది జర్నలిస్టులు ఈ వీడియోను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. తాలిబాన్ ఒక వ్యక్తిని చంపి కందహార్ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తున్న యూఎస్ మిలిటరీ హెలికాప్టర్‌తో ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు.

చరిత్రలో నేటినిజం



ప్రపంచ యుద్ధాలతో నరమేధ విధ్వంసమే

(01 సెప్టెంబర్ "ప్రపంచ యుద్ధం-2 ప్రారంభ దినం", 02 సెప్టెంబర్ 'ప్రపంచ యుద్ధం-2 ముగిసిన దినం' సందర్భంగా)

ప్రపంచ దేశాలు 'అల్లీస్ (ఫ్రాన్స్, యుకె, యుయస్, యుయస్‌యస్‌ఆర్, చైనా, పోలాండ్)' మరియు 'ఆక్సిస్ (జర్మనీ, జపాన్, ఇటలీ)' అనబడే రెండు జట్లుగా విడిపోయి 1939 నుంచి 1945 వరకు జరిగిన భీకర 2వ ప్రపంచ యుద్ధంలో 30 దేశాలకు చెందిన 100 మిలియన్ల జనాభా పాల్గొనడం, 85 మిలియన్ల సైనిక/సామాన్య జనుల ప్రాణ నష్టం, అణుబాంబుల విధ్వంస (హిరోషిమ, నాగసాకి) తొలి భయానక అనుభవాలు, యుద్ధ అనంతర కరువులు, వ్యాధుల వ్యాప్తి, ఆస్తి విధ్వంసాలు, మారణహోమం, నరమేధం, అపార ఆర్థిక కుదుపులతో ప్రపంచ దేశాలు చరిత్రలోనే అత్యంత చేదు అనుభవాలను చవిచూశాయి. ఆక్సిస్ వర్గపు జర్మనీ, జపాన్ వర్గ దేశాలు అపార ఆస్తి ప్రాణ నష్టాలను నమోదు చేసుకోవడం, కనీసం 12 మిలియన్ల ప్రాణ నష్టం జరగడం అత్యంత బాధాకరం. విజేతలైన అల్లీస్ వర్గంలో కూడా దాదాపు 61 మిలియన్ల ప్రాణ నష్టం జరిగిందని తెలుస్తున్నది. ఒక్క సోవియట్ యూనియన్లోనే 27 మిలియన్లు, జర్మనీ 5.3 మిలియన్లు, చైనా 7.5 మిలియన్ల ప్రాణాలను కోల్పోవలసి వచ్చింది. వరల్డ్ వార్-2లో దాదాపు 87,000 మంది సైనికులు, లక్షకు పైగా సామాన్య జనం ప్రాణ త్యాగం చేశారు. ప్రపంచ యుద్ధం-2 నేర్పిన గుణపాఠాన్ని గమనించిన ఐరాస సత్వరమే చొరవ తీసుకొని, ఇలాంటి యుద్ధాలు మానవాళికి శాపాలుగా మారుతాయని అంగీకరించి, ప్రపంచ యుద్ధాలను నిరోధించడంలో భాగంగా నాటి అగ్రరాజ్యాలైన యుయస్, రష్యా, యుకె, ఫ్రాన్స్, చైనా సభ్యుల శాశ్వత సభ్యత్వంతో కూడిన 'ఐరాస భద్రతా మండలి'ని ఏర్పాటు చేయడం విధితమే. అనంతర అర్ధ శతాబ్దకాలం పాటు అమెరికా, సోవియట్ యూనియన్‌ల మధ్య ప్రచ్ఛన్న యుద్ధ మేఘాలు కమ్ముకోవడం చూశాం.

01 సెప్టెంబర్ 1939న హిట్లర్ నాజీ జర్మనీ సేనలు పోలాండ్‌పై దండయాత్ర చేయడంతో 2వ ప్రపంచ యుద్ధానికి బీజాలు పడ్డాయి. ఈ దాడిని ఖండించిన యుకె, ఫ్రాన్స్ దేశాలు 03 సెప్టెంబర్‌న జర్మనీపై యుద్ధం ప్రకటించడంతో భీకర ప్రపంచ యుద్ధం విధ్వంసక జడలను విప్పడం, ప్రపంచ దేశాలు రెండుగా విడిపోవడంతో యుద్ధ తీవ్రత మానవాళి మనుగడను ప్రశ్నార్థకం చేసింది. హిట్లర్ ఆత్మహత్య చేసుకోవడంతో జర్మనీ దురాక్రమణ చేసిన భూమిని వదిలేయడంతో 08 మే 1945న బేషరతుగా జర్మనీ ఓటమిని అంగీకరించడం జరిగింది. ఓటమిని అంగీకరించని జపాన్‌లోని హిరోషిమ 06 ఆగష్టు 1945), నాగసాకి (09 ఆగష్టు 1945) నగరాలపై రెండు అణుబాంబులు వేయడంతో జపాన్ ఓటమిని అంగీకరించడం (15 ఆగష్టు)తో 2వ ప్రపంచ యుద్ధం 02 సెప్టెంబర్ 1945న ముగిసినట్లు ప్రకటన వెలువడింది.

3వ ప్రపంచ యుద్ధ మేఘాలు కమ్ముతున్నాయా..?

ప్రపంచ మానవాళి చరిత్ర మనకు అద్వితీయ గుణపాఠాలను నేర్పుతున్నది. యుద్ధాలు ఎవరు గెలిచిన మారణహోమం, మానవ వనరుల విధ్వంసం తప్పనిసరి. రెండు ప్రపంచ యుద్ధాలు పరిచయం చేసిన అపార మారణహోమం నుంచి మనందరిలో ఆత్మ విమర్శలకు దారులు తెరవాలి. శతాబ్దం దాటిన ప్రపంచ యుద్ధం-1, 75 ఏండ్ల 2వ ప్రపంచ యుద్ధ క్షేత్రాల్లో కోట్ల ప్రాణాలు గాల్లో కలవడం, అపార ఆస్థి నష్టం నమోదు కావడం మనకు హెచ్చరిక కాలాలి. 3వ ప్రపంచ యుద్ధమే జరిగితే అత్యాధునిక ఆయుధాలు, అణు బాంబు విధ్వంసాలతో భూమి బద్దలు కావడం ఖాయమని తెలుసుకోవాలి. ఓడిన వారు సర్వస్వాన్ని, గెలిచిన వారు భవిష్యత్తు తరాలను కోల్పోతారు. అమెరికాతో ఉత్తర కొరియా, ఇండియాతో చైనా/పాక్, తైవాన్‌తో చైనా దేశాల మధ్య అనాదిగా యుద్ధ వాతావరణం నెలకొని ఉంది. శక్తివంతమైన క్షిపణులు (మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్), అణ్వాయుధాల అమ్ముల పొదలు భూగోళం దద్దరిల్లేలా గర్జనలు చేయనున్నాయి. సిరియా, అఫ్ఘానిస్థాన్, ఉత్తర కొరియాలు ప్రపంచ శాంతికి విఘాతాలుగా మారుతున్నాయి. వీటికి తోడుగా నేడు మరో 67 దేశాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం నెలకొని ఉంది. నేడు ఏ రెండు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైనా, మరో ప్రపంచ యుద్ధానికి కారణం కావచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రపంచ దేశాలు శాంతి పావురాలను ఎగురవేస్తూ, వసుదైక కుటుంబ భావనలకు పట్టాభిషేకం చేస్తూ, సర్వమానవ సంక్షేమ దిశగా అడుగులు వేయాలని ఆశిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

అల్జీరియన్ నావికాదళంతో కలిసి భారత నేవీ తొలి సైనిక విన్యాసాలు

న్యూఢిల్లీ, ఆగష్టు 31:ఐరోపా, ఆఫ్రికాలో కొనసాగుతున్న సుహృద్భావ పర్యటనలో భాగంగా భారత్‌కు చెందిన ఐఎన్ఎస్ ఢాబర్, 29వ తేదీ, ఆగస్టు 2021న అల్జీరియన్ నేవీషిప్ 'ఎజాడ్జైర్'తో కలిసి ఒక సంయుక్త సముద్ర భాగస్వామ్య విన్యాసంలో పాల్గొంది. అల్జీరియన్ సముద్ర తీరంలో జరిగిన మైలురాయి లాంటి ఈ విన్యాసంలో ఫ్రంట్‌లైన్ అల్జీరియన్ యుద్ధనౌక 'ఎజాడ్జైర్' పాల్గొంది. ఈ విన్యాసంలో భాగంగా భారతదేశం మరియు అల్జీరియన్ యుద్ధనౌకల మధ్య కో-ఆర్డినేటెడ్ మ్యాన్యుయరింగ్, కమ్యూనికేషన్ విధానాలు మరియు ఆవిరి గతంతో సహా విభిన్న కార్యకలాపాలు చేపట్టబడ్డాయి.

ఈ విన్యాసంలో భాగంగా సమన్వయ యుక్తితో సహా.. భారత మరియు అల్జీరియన్ యుద్ధనౌకల మధ్య కమ్యూనికేషన్ విధానాలు, స్టీమ్‌పాస్ట్ విన్యాసాలను చేపట్టారు. ఈ సంయుక్తం విన్యాసాలు రెండు దేశాల నౌకాదళాలు పరస్పరం అనుసరించే కార్యకలాపాల భావనను అర్థం చేసుకోవడానికి వీలు కల్పించింది, మెరుగైన ఇంటర్‌ఆపెరాబిలిటీని మరియు భవిష్యత్తులో వారి మధ్య పరస్పర చర్య, సహకారాన్ని పెంచే అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చింది.

హైదరాబాద్‌లో పెరిగిన బిర్యానీ ధరలు!

హైదరాబాద్ , ఆగష్టు 31:హైదరాబాద్ బిర్యానీ ప్రియులకు ఇది చేదు వార్త. అఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ల ఆక్రమణకు గురైన నేపథ్యంలో ఆ సంక్షోభం హైదరాబాద్ బిర్యానీ ప్రియులపై పడింది. అఫ్గాన్ నుంచి మసాలా దినుసుల దిగుమతులు నిలిచిపోవడంతో ఇక్కడ వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో హైదరాబాద్ బిర్యానీ ధరలను తయారీదారులు పెంచేశారు.

హైదరాబాద్‌లో బిర్యానీ తయారీలో వినియోగించే మసాలా దినుసులు ఎక్కువగా అఫ్ఘనిస్తాన్ నుంచే దిగుమతి అవుతుంటాయి. చాలామంది అఫ్గాన్ వ్యాపారులు హైదరాబాద్‌లో నివాసం ఏర్పాటు చేసుకుని మసాలా దినుసుల వ్యాపారం చేస్తున్నారు. ఇప్పుడు ఆ దేశాన్ని తాలిబన్లు ఆక్రమించుకోవడంతో భారత్ కు దాదాపు దిగుమతులు నిలిచిపోయాయి. దీంతో వాటి ధరలు పెరగడంతో రెస్టారెంట్ల యజమానులు సైతం బిర్యానీ ధరను ఏకంగా రూ.100కి పైగా పెంచేశారు.

రెస్టారెంట్లను బట్టి గతంలో హైదరాబాద్‌లో బిర్యానీ ప్లేట్ ధర రూ.250 వరకు ఉండగా.. ఇప్పుడు రూ.350వరకు పెరిగింది. రూ.400 ఉండే ఫ్యామిలీ ప్యాక్ బిర్యానీ ధర రూ.550 వరకు చేరింది. ఇక, జంబో ప్యాక్ ధర రూ.600 ఉండగా.. రూ.700-800 వరకు పెంచేశారు. పెరిగిన ధరతో బిర్యానీ ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తివేత..

నిజామాబాద్, ఆగష్టు 31:నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్నాయి. గోదావరి ఎగువ ప్రాంతాలతో పాటు పరీవాహక ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు డ్యామ్‌లోకి వరద వచ్చి చేరుతోంది. ప్రస్తుతం డ్యామ్‌కు 52,340 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అధికారులు జలాశయం 16 గేట్లు ఎత్తి 49,920 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 7,500 క్యూసెక్కులు నీరు గోదావరిలోకి వెళ్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం నీటిమట్టం 1090.9 అడుగులుగా ఉన్నది. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 90 టీఎంసీలు కాగా.. ఇప్పుడు 89.76 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మరోవైపు నిజామాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలు ప్రాంతాల్లో రోడ్లు తెగిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా వాగులు నిండుగా ప్రవహిస్తున్నాయి. దర్పల్లి, భీంగల్, తిరుకొండ ప్రాంతాల్లో మొదలయ్యే వాగు అన్ని ప్రాంతాల్లో పూర్తిగా నిండి రోడ్లపై పారుతోంది. దీంతో అనేక ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి.

నేడు, రేపు కడప జిల్లాలో సీఎం జగన్ పర్యటన

అమరావతి, ఆగష్టు 31:పెళ్లి రోజు సందర్భంగా కుటుంబంతో కలిసి సిమ్లా వెళ్లిన ఏపీ సీఎం జగన్ తన వ్యక్తిగత పర్యటన ముగించుకుని అమరావతి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో రేపు, ఎల్లుండి కడప జిల్లాలో సీఎం జగన్ పర్యటించనున్నారు. బుధవారం మధ్యాహ్నం 3:30 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి కడప బయలుదేరనున్న సీఎం సాయంత్రం 4:50 గంటలకు ఇడుపులపాయ చేరుకోనున్నారు. అక్కడ పార్టీ నాయకులతో మాట్లాడి, వైఎస్ఆర్ ఎస్టేట్‌లోని గెస్ట్‌హౌస్‌లో రాత్రికి బస చేయనున్నారు.

సెప్టెంబర్ 2న దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఉదయం 9:30 గంటలకు ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని నివాళులు అర్పించనున్నారు. అనంతరం పార్టీ నాయకులతో మాట్లాడి తాడేపల్లికి తిరుగుపయనం కానున్నారు. ఉదయం 11:30 గంటలకు కడప ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరి మ.12:45 గంటలకు తాడేపల్లి నివాసానికి సీఎం జగన్ చేరుకుంటారు.

టీఆర్ఎస్ జెండా పండుగను విజయవంతం చేయాలి : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్ , ఆగష్టు 31:సెప్టెంబర్ 2న జరిగే టీఆర్ఎస్ జెండా పండుగను సతన్‌నగర్ నియోజకవర్గంలో విజయవంతం చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం ఉదయం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో నియోజకవర్గం కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జెండా పండుగ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఢిల్లీలో అత్యంత శోభాయమానంగా నిర్మించ తలపెట్టిన టీఆర్ఎస్ కార్యాలయానికి అదే రోజున సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయనున్నారన్నారు.

నియోజకవర్గం నలుదిశలా టీఆర్ఎస్ జెండా రెపరెపలాడే విధంగా జెండా ఆవిష్కరణలు జరిగేలా చూడాలని పార్టీ నాయకులను ఆదేశించారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి టీఆర్ఎస్ మాత్రమే చిత్తశుద్ధితో కృషి చేసిందని, నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని రీతిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, టీఆర్ఎస్ విజయాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్లు కూర్మ హేమలత, మహేశ్వరి, కొలను లక్ష్మిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఎన్.శేషుకుమారి, అత్తెల్లి అరుణగౌడ్, ఉప్పల తరుణిలతో పాటు డివిజన్ల అధ్యక్షులు అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, కొలను బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాపై జోకులా?: మంత్రి మల్లారెడ్డిపై దమ్మాయిగూడ ప్రజల ఆగ్రహం

హైదరాబాద్ , ఆగష్టు 31:తెలంగాణ మంత్రి మల్లారెడ్డి మరో వివాదంలో చిక్కుకున్నారు. మంత్రి మల్లారెడ్డిపై దమ్మాయిగూట ప్రజలు మండిపడుతున్నారు. క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేస్తున్నారు. మంత్రి జోక్ గా చేసిన కామెంట్లే ఈ వివాదానికి కారణం. హైదరాబాద్ శివారులోని జవహర్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం జరిగిన పాపన్న విగ్రహాన్ని మంత్రి మల్లారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ప్రసంగించిన ఆయన.. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే డంపింగ్ యార్డ్ ప్రస్తావన తీసుకొచ్చారు."డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన జవహర్ నగర్‌కు రావడంలేదె?. దమ్మాయిగూడ వైపు వెళ్లిపోయింది" అంటూ నవ్వుతూ అన్నారు.

మంత్రి వ్యాఖ్యలపై డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట సమితి తీవ్రంగా మండిపడుతోంది. మల్లారెడ్డి మాటలు దమ్మాయిగూడ ప్రజలను అవమానించేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. మంత్రి గారూ.. దమ్మాయి గూడకు వాసన వస్తే మీకు అదృష్టమా ? అంటూ ప్రశ్నిస్తున్నారు. వాసన జవహర్ నగర్ నుంచి దమ్మాయి గూడకు రాదు, దమ్మాయి గూడ నుంచి జవహర్ నగర్‌కు పోదు.. అది గాలి ఎటువుంటే అటే పోతుందన్నారు. మంత్రి దమ్మాయిగూడ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పడంతో పాటు ఈ డంపింగ్ యార్డ్ మూసివేతకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

మంత్రి మల్లారెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేపట్టింది. దమ్మాయిగూడ ప్రజలకు క్షమాపణ చెప్పే వరకు ఈ పోరాటం ఆగదని స్థానిక నేతలు స్పష్టం చేశారు. ప్రజల కోసం ఒక ప్రశ్నించే గొంతుగా కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ముందు ఉంటుందన్నారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులను, మంత్రి మల్లారెడ్డి ఆదేశాలతో పోలీసులు అక్రమ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైన డంపింగ్ యార్డు నుంచి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మల్లారెడ్డి సరదాగా అన్నప్పటికీ ఆ మాటలు ప్రస్తుతం వివాదాస్పదంగా మారడం ఆయనకు కొత్త తలనొప్పి తెచ్చిపెట్టింది.

కాగా, ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మల్లారెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగిన సంగతి తెలిసిందే. ఇద్దరు నేతలు ఒకరిపై మరొకరు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో మంత్రి మల్లారెడ్డి తొడలు కొట్టి మరీ రేవంత్ పై విరుచుకుపడ్డారు.

కేసీఆర్, హరీశ్ రావులకు ఈటల సవాల్

హైదరాబాద్ , ఆగష్టు 31:హుజురాబాద్ ఉపఎన్నిక నేపథ్యంలో టీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. టీఆర్ఎస్ నేతలు మాజీ మంత్రి ఈటలను టార్గెట్ చేయగా? ఆయన కౌంటర్ ఇస్తున్నారు. సీఎం కేసీఆర్‌కు దమ్ముంటే హుజూరాబాద్ ఎన్నికల్లో తన మీద పోటీ చేయాలని బీజేపీ నేత ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. తాను ఓడితే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని, గెలిస్తే సీఎం పదవికి కేసీఆర్ రాజీనామా చేస్తారా అని ప్రశ్నించారు. వాళ్లను, వీళ్లను నిలబెట్టడం కాదని.. కేసీఆర్ లేదా హరీశ్‌రావు ఇద్దరిలో ఎవరు నిలబడతారో చెప్పాలన్నారు. కేసులు పెట్టి బెదిరించడం కాదు, దమ్ముంటే నేరుగా కొట్లాడాలని హితవు పలికారు.

2001లో తన ఆస్తులెన్నో చెప్తానని, కేసీఆర్ ఆస్తులెన్నో చెప్తారా అని ప్రశ్నించారు. ఓటుకు రూ.20 నుంచి రూ. 30 వేలు ఇస్తామంటున్నారని, ఇక్కడి ప్రజలు ఆకలినైనా భరిస్తారని, ఆత్మగౌరవాన్ని అమ్ముకోరన్నారు. మనుషుల్ని కొనే నీచ సంస్కృతికి కేసీఆర్ దిగజారారని విమర్శించారు. హుజూరాబాద్‌లో అభివృద్ధి జరగలేదని హరీశ్‌రావు, టీఆర్ఎస్ లీడర్లు అబద్ధాలు చెబుతున్నారని ఈటల మండిపడ్డారు. సిద్దిపేట నియోజకవర్గానికి ఎన్ని వందల కోట్ల పనులు మంజూరు అయ్యాయో.. హుజురాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని హరీశ్‌కు సవాల్ విసిరారు. "వాళ్లు వీళ్లు కాదు.. మామా అల్లుళ్లు నిలబడండి. మీరు గెలిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా. నేను గెలిస్తే సీఎం పదవికి కేసీఆర్ రాజీనామా చేస్తరా?"అని ఈటల ప్రశ్నించారు.

ఏదో ఒక రోజు హరీశ్ రావును బొండిగ కూడా పిస్కుతరని అన్నారు. టీఆర్ఎస్ లో తనకు మాత్రమే అవమానం జరగలేదన్న ఈటల? తాను మాత్రమే కన్నీళ్లు పెట్టుకోలేదన్నారు. తాను, హరీశ్ రావులు ఎన్నో సార్లు అవమాన భారంతో కుంగిపోయినమో టైమొచ్చినప్పుడు డేట్‌లతో సహా చెప్తానని ఈటల స్పష్టం చేశారు.

జలశక్తి శాఖ మంత్రిని కలిసిన టీడీపీ ఎమ్మెల్యేలు

అమరావతి, ఆగష్టు 31:వెలిగొండ ప్రాజెక్టు సమస్యపై ఏపీకి చెందిన పలువురు టీడీపీ నేతలు కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో కలిశారు. ఈ సందర్భంగా కేంద్రం జారీ చేసిన గెజిట్‌లో వెలిగొండ ప్రాజెక్ట్‌ను ప్రకటించలేదన్నారు. వెలిగొండ ప్రాజెక్టును తక్షణమే అనుమతి పొందిన ప్రాజెక్టుగా కేంద్ర గెజిట్‌లో చేర్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రకాశం జిల్లాలో కరువు పరిస్థితి, ప్రాజెక్టు ప్రాధాన్యతను గజేంద్ర సింగ్ షెకావత్‌కు నేతలు వివరించారు. టీడీపీ నేతల విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లుగా తెలుస్తోంది. జల్‌శక్తి మంత్రిని కలిసిన వారిలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు ఉన్నారు.

ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్, దోల బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యేలు బోలినేని రామారావు, మాజీ ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, డా. ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, దామచర్ల జనార్దన్ రావు తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

కాగా, వెలిగొండ ప్రాజెక్ట్ పై తెలంగాణ సీఎం కేసీఆర్‌కు ప్రకాశం జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు ఆదివారం లేఖ రాసిన సంగతి తెలిసిందే. అంతకు రెండు రోజుల ముందు ఈ ప్రాజెక్ట్‌కు నిధులు ఇవ్వొద్దంటూ కేంద్రానికి తెలంగాణ లేఖ రాసింది. ఈ క్రమంలో వెలిగొండకు అనుమతులు లేవనడం సరికాదని, ఆ ఫిర్యాదుపై పునరాలోచన చేయాలని ప్రకాశం జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు తెలంగాణ సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఏపీ ప్రభుత్వ తీరు వల్లే ఈ ప్రాజెక్ట్‌కు అనుమతి లేదని గెజిట్‌లో పెట్టారని, కానీ 2014 విభజన చట్టంలో కల్వకుర్తి, నెట్టెంపాడుతో సహా వెలిగొండ ప్రాజెక్ట్‌ను కూడా పెట్టారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు.

కొవిడ్ నిబంధనలు పాటిస్తూ పాఠశాలల నిర్వహణ : మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్ , ఆగష్టు 31: కొవిడ్ నిబంధనలు పాటిస్తూ పాఠశాలలు నిర్వహించాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రుల మనోభావాలకు అనుగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. సోమవారం విద్యా శాఖ అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ 1వ తేదీ నుండి రాష్ట్రంలో విద్యా సంస్థలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలు తప్పనిసరిగా అమలు చేయాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు.

కొవిడ్ నిబంధనల అమలులో అలసత్వం చూపరాదని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ, శానిటైజేషన్ పూర్తి చేసేందుకు మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల సహకారాన్ని తీసుకుని శుభ్రం చేయాలని కోరారు. కోవిడ్‌కు సంబంధించి ఎలాంటి ఆందోళన పెట్టుకోకుండా, చిన్నారులు పాఠశాలలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని మానసికంగా సిద్ధం చేయాలని కోరారు. తరగతులు నిర్వహిస్తున్న సమయంలో విద్యార్థులు తప్పనిసరి గా మాస్కులు ధరించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థుల్లో ఎవరికైనా జ్వర సూచన ఉంటే ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్ వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి తీసుకువెళ్లి కోవిడ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఒకవేళ కోవిడ్ నిర్ధారణ అయితే విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగించాలని కోరారు. హాజరయ్యే విద్యార్థులు శానిటైజేషన్ చేసుకోవడం, మాస్కులను విధిగా ధరించడం వంటి కోవిడ్ నియంత్రణ చర్యలను పాటించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేన తదితరులు పాల్గొన్నారు.

అతి పెద్ద నౌక నుంచి సరకులను దించి రికార్డు సృష్టించిన వీఓ చిదంబరనార్ పోర్ట్

న్యూఢిల్లీ, ఆగష్టు 31:అతి పెద్ద నౌక నుంచి సరకులను దించి చిదంబరనార్ పోర్ట్ 29.08.2021 న సరికొత్త రికార్డు సృష్టించింది. యూఏఈ లోని మినా సాకర్ రేవు నుంచి మెస్సర్స్ చెట్టినాడ్ సిమెంట్స్ కి సింగపూర్ కి చెందిన ఎంవీ ఇన్స్ అంకారా నౌక లో వచ్చిన 93.719 టన్నుల సున్నపు రాయిని దించి చిదంబరనార్ పోర్ట్ ఈ రికార్డు సృష్టించింది. గతంలో 2021 మే 14వ వ తేదీన ఎంవీ బషన్స్ నౌక నుంచి 92,935 టన్నుల బొగ్గును దింపి నెలకొల్పిన రికార్డును 29.08.2021 న అధిగమించడం జరిగింది.

నౌకను 2021 ఆగస్ట్ 26న బెర్త్ నెంబర్ ఎచీకి వచ్చింది. దీనిలో ఉన్న సరకును మూడు హార్బర్ మొబైల్ క్రేనులను ఉపయోగించి రోజుకు 50,000 టన్నుల చొప్పున దింపడం ప్రారంభించారు. 29వ తేదీ నాటికి మొత్తం సరకును దింపారు. సున్నపు రాయిని తీసుకుని వచ్చిన నౌక గా ఏజెంట్ మెస్సర్స్ మాక్సన్స్ షిప్పింగ్ ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్, స్టీవెడరింగ్ ఏజెంట్ గా మెస్సర్స్ చెట్టినాడ్ లాజిస్టిక్స్, ట్యూటికోరిన్ పనిచేసాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2021-22లో వీఓ చిదంబరనార్ పోర్ట్ ద్వారా జరుగుతున్న సరకుల రవాణాలో గణనీయమైన పెరుగుదల కనిపిస్తోంది. 2021 జూలై వరకు పోర్ట్ 11.33 మిలియన్ టన్నుల సరుకులను రవాణా చేసింది. గత ఏడాది ఇదే కాలంలో సరుకుల రవాణా 10.58 మిలియన్ టన్నులుగా ఉంది. గత ఏడాదితో పోల్చి చూస్తే 7.14% వృద్ధి రేటు నమోదు అయ్యింది. చిదంబరనార్ పోర్ట్ కంటైనర్ రవాణాలో కూడా గణనీయమైన మెరుగుదల కనబరిచింది. పోర్ట్ ఈ ఆర్థిక సంవత్సరంలో జూలై 2021 వరకు 2.69 లక్షల ఙఙ లను నిర్వహించింది గత ఆర్థిక సంవత్సరం సంబంధిత కాలంతో పోలిస్తే 21.07 %వృద్ధిని నమోదు చేసింది.

ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలి : ఎమ్మెల్యే ముఠా గోపాల్

హైదరాబాద్ , ఆగష్టు 31:ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ టీఆర్ఎస్ పార్టీ మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి వనజా గంగాధరి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో విద్యార్థులకు బుక్స్??,స్టేషనరీ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందించే బాధ్యత నాయకులు కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముఠానరేష్, యువనాయకుడు ముఠాజైసింహ, మాజీ కార్పొరేటర్ మాచర్ల పద్మ, డివిజన్ అధ్యక్షుడు ఎరం శ్రీనివాస్ గుప్తా, ముచ్చకుర్తి ప్రభాకర్, లక్ష్మీ, రాకేశ్, హన్మంతు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానంపై ప్రజల్లో అవగాహన పెంచాలి

జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ శర్మన్

హైదరాబాద్ , ఆగష్టు 31: ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసే విధంగా ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ శర్మన్ అన్నారు. 36వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ శర్మన్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఒకవ్యక్తి నేత్ర దానం చేస్తే.. ఇద్దరికి కంటి చూపు వస్తుందన్నారు. నేత్ర దానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఒక ఉద్యమంలా ముందుకు వెళ్లాలన్నారు. ప్రజల్లో అవగాహన పెరిగినప్పుడే స్వచ్ఛందంగా నేత్ర దానం చేసేందుకు ముందుకు వస్తారని, ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

హైదరాబాద్ , ఆగష్టు 31: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఉప్పల్‌లోని మేకల భారతిగార్డెన్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ సోమవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే.. లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకంతో ఎంతోమంది పేద కుటుంబాలకు సీఎం కేసీఆర్ పెద్దన్నగా నిలిచారన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచి, వారికి ప్రభుత్వం చేయూ తనందిస్తుందన్నారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. పేద ప్రజలకు అడగకుండానే అన్ని రకాల పథకాలు తీసుకువచ్చి, వారికి తోడ్పాటు అం దిస్తున్నారని, అన్నివర్గాలకు ప్రయోజనం చేకూర్చేవిధంగా కృషి చేస్తున్నారని తెలిపారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగు ణంగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమంలో రాజీలేని పోరాటం చేస్తామన్నారు. అభివృద్ధి కోసం అందరిని కలుపుకొని పనిచేస్తామన్నారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసిరావాలని సూచించారు. కార్యక్రమంలో ఉప్పల్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్, ప్రభుదాస్, మందుముళ్ల రజితాపరమేశ్వర్‌రెడ్డి, చేతన, వాణి, నేతలు వేముల సంతోష్‌రెడ్డి, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, మేకల మధుసూదన్‌రెడ్డి, చింతల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

లకోటియా బడి అభివృద్ధికి రూ.60 లక్షలు

హైదరాబాద్ , ఆగష్టు 31:అంబర్‌పేట సీపీఎల్‌లో గల లకోటియా ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే అభివృద్ధి నిధుల నుంచి రూ.60లక్షలు మం జూరు చేస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఎల్. శర్మన్ తెలిపారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, డీప్యూటీ ఈవో గాజుల శ్రీధర్, కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, దూసరి లావణ్యశ్రీనివాస్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ సోమవారం అంబర్‌పేటలోని లకోటియా ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న దృష్ట్యా ఇక్కడ కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మధుశాలిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ప్రస్తుత పాఠశాల భవనం, కొత్త భవనానికి మధ్య కనెక్టివిటి లేదని, కొత్త భవనంలో టా యిలెట్ల సౌకర్యం లేదని హెచ్ఎం కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఎమ్మెల్యే కాలే రు కల్పించుకొని తన ని యోజకవర్గం అభివృద్ధి ని ధుల నుంచి రూ.60 లక్షలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని చెప్పారు. తాను ఎప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు. మొదట పాఠశాలలో సివిల్ వర్క్స్ పూర్తి చేద్దామని, ఇవి పూర్తైన తరువాత కొత్త భవనంలో బెంచీలు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేద్దామన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, దూసరి లావణ్యగౌడ్, డాక్టర్లు కాలేరు దీప్తిపటేల్, గీతారాణి, ఇతర జీహెచ్ఎంసీ, వైద్య సిబ్బంది కలిసి బస్తీల్లో వ్యాక్సినేషన్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ తీసుకోవాలని ఇంటింటికీ తిరిగి చెప్పారు. ఈ ర్యాలీలో జిల్లా కలెక్టర్ ఎల్. శర్మన్ పాలుపంచుకున్నారు.

పేదల వైద్యానికి భరోసా సీఎంఆర్ఎఫ్ : ఎమ్మెల్యే సుధీరెడ్డి

హైదరాబాద్ , ఆగష్టు 31: సీఎం సహాయనిధి పేదల వైద్యానికి భరోసానిస్తోందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే, ఎమ్మార్డీసీ చైర్మన్ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం ఆర్టీసీ కాలనీకి చెందిన మంగమ్మ తీవ్ర కడుపునొప్పితో దవాఖానలో చేరింది. ఆర్థిక స్థోమత సరిపోకపోవడంతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సిఫారసుతో సీఎంఆర్ఎఫ్‌కు దరకాస్తు చేసుకుంది.

దీంతో ఆమెకు రూ.60వేలు మంజూరయ్యాయి. ఆ చెక్కును మంగళవారం బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని సూచించారు. పనుల వత్తిడిలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కరోనా ప్రమాదం పొంచి ఉందని కోవిడ్ నిబంధనలు పాటించాలని సూచించారు.

కార్యక్రమంలో వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్లా రాజశేఖర్‌రెడ్డి, టీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, నవీద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

హైదరాబాద్ , ఆగష్టు 31:మధుబన్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి సమస్యలపై వినతి పత్రం సమర్పించారు.మధుబన్ కాలనీ ఏర్పడి 37 సంవత్సరాలు కావస్తున్నదని, అయినా ఇప్పటికీ కాలనీలో పలు సమస్యలు ఉన్నాయని తెలిపారు.

5 పార్కు స్థలాలు ఉన్న ఒక్క పార్కు అభివృద్ధికి నోచుకోవడంలేదని ఎమ్మెల్యేకు వివరించారు.బస్తీ దవాఖాన లేక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే మధుబన్ ప్రధాన రహదారిపై నిత్యం డ్రైనేజీ నీరు పొంగి పొర్లుతుందని అన్నారు.కాలనీలో పందుల బెడద కూడా తీవ్రంగా ఉందని, వాటిని కాలనీలో నుంచి తరలించేలా చూడాలని కోరారు.

కాలనీలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని కాలనీ అధ్యక్ష కార్యధర్శులు కోరారు. సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని అధ్యక్షుడు సామల సతీష్ అన్నారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో కావలి వెంకటేష్,గోవిందర్‌రాజ్ ,డీవి కుమార్ ,ఆర్ ప్రశాంత్‌గౌడ్ ,నాని,విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

9న సిల్వర్ కంపౌండ్ 'డబుల్' ఇండ్ల ప్రారంభోత్సవం

హైదరాబాద్ , ఆగష్టు 31: అనివార్య కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తున్న రసూల్‌పురా సిల్వర్ కంపౌండ్ డబుల్ బెడ్‌రూం ఇండ్ల ప్రారంభోత్సవానికి ఎట్టకేలకు ముహూర్తం కుదిరింది. ఈ క్రమంలో సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని పశుసంవర్ధక , సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నివాసంలో ఆయనను కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న కలిశారు.

ఈ సందర్భంగా పలు అంశాలతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో సహా, గణపతి, శ్రీ వేంకటేశ్వర పెరుమాల్ దేవస్థానం ఆలయ కమిటీలకు సంబంధించిన విషయాలపై సుధీర్ఘంగా చర్చించారు. కంటోన్మెంట్ ప్రాంతంలో చేపడుతున్న అభివృద్ధి పనుల తీరుతెన్నులపై మంత్రి,ఎమ్మెల్యేను అడిగి తెలుసుకున్నారు.

ఈ నేపథ్యంలో రసూల్‌పురాలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంలో భాగంగా తొలుతగా 168 ఇండ్లు పూర్తవడంతో లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల ప్రారంభోత్సవాన్ని వచ్చే నెల 9వ తేదీన ఖరారు చేశారు.

అనంతరం మంత్రి తలసాని, ఎమ్మెల్యే సాయన్న మాట్లాడుతూ డబుల్ ఇండ్లను అర్హులైన పేదలకే అందజేస్తున్నామని, ఇండ్ల మంజూరులో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండదని, దళారులను నమ్మి మోసపోవద్దని సూ చించారు.అభివృద్ధి,సంక్షేమం ప్రభుత్వానికి రెండు కండ్లు అన్నారు. సీఎం కేసీఆర్ రూపొందించిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అదే విధంగా మారేడ్‌పల్లిలో నిర్మించిన సు మారు 456 ఇండ్లను సెప్టెంబర్ చివరి వారంలో లబ్ధిదారులకు అందించేందు కు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు.

వరద సహాయక చర్యలకు పోలీసులు సిద్ధంగా ఉండాలి

-కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ



కరీంనగర్ ఆగష్టు 31:(నేటినిజం ప్రతినిధి): వరద సహాయక చర్యలు చేపట్టేందుకు కమిషనరేట్ వ్యాప్తంగా పోలీసులు సిద్ధంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ పిలుపునిచ్చారు. వర్షాల ప్రభావంతో నదులు,వాగులు,వంకలు ఉప్పొంగడం, జలాశయాలు నిండుకుని నీటిని విడుదల చేస్తుండటంతో లోతట్టుప్రాంతాలకు ముంపునకు గురయ్యే ప్రమాదంఉందని, ఆయా ప్రాంతాల్లోని ప్రజలను ఎప్పటికప్పుడూ అప్రమత్తం చేయాలని తెలిపారు.

వరదసహాయక చర్యల కోసం వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన అధికారులు, వాలంటీర్ల సహకారం తీసుకోవాలని చెప్పారు. సోమవారంనాడు గన్నేరువరం చెరువుమత్తడి వరదలో చిక్కుకున్న బెజ్జంకి మండలం బేగంపేట గ్రామానికి చెందిన వ్యక్తిని ఎస్ఐ అవుల తిరుపతి ఆధ్వర్యంలో సాహసోపేతమైన చర్యలు తీసుకుని రక్షించిన విషయం విదితమే. గతంలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల ప్రభావంతో రోడ్లు తెగిపోవడం, రవాణావ్యవస్థ స్థంభించిపోవడం, లోతట్టుప్రాంతాలు ముంపునకు గురవ్వడంతో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలకు సహాయం అందించడం కోసం కరీంనగర్ కమిషనరేట్‌లోని పోలీసులు వరదసహాయక చర్యలు కొనసాగించారు. తాము శాంతిభద్రతలకే పరిమితంకాదు సమాజసేవలోనూ ముందుంటామని ఈ సహాయక చర్యలతో మరోసారి సేవలను చాటారు. అన్నిస్థాయిలకు చెందిన పోలీసులు రెట్టించిన ఉత్సాహంతో వరదసహాయక చర్యల్లో పాల్గొనాలని సూచించారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా శిథిలావస్థలో ఉన్న ఇళ్ళు కూలిపోయే ప్రమాదం ఉందని, అలాంటి ఇళ్ళలో ఉంటున్న వారిని వెంటనే తాత్కాలిక శిబిరాలకు తరలించి ఆశ్రయం కల్పించాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లోని పరిస్థితులను సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు చెందిన అధికారులు ఎప్పటికప్పుడూ సమీక్షిస్తూ, ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. మైకులద్వారా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్చరికలు తెలియజేస్తున్నారు. కరీంనగర్‌లోని కొన్నిప్రాంతాల్లో రోడ్లపై నీరునిలిచిఉండటంతోపాటు, గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారడంతో ట్రాఫిక్‌పోలీసులు బృందాలుగా ఏర్పడి ప్రమాదాలు జరుగకుండా కోన్లు, స్టాపర్లను అడ్డుగాపెట్టారు.

యశ్వంత్‌ను సన్మానించిన మంత్రి సత్యవతి రాథోడ్

హైదరాబాద్ , ఆగష్టు 31:తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారులను ఎంతో ప్రోత్సహిస్తున్నది గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. వారికి కావాల్సిన వసతులను, ఆర్థిక సహాయాన్ని చేస్తూ వారి లక్ష్యాలను నెరవేర్చడంలో ప్రభుత్వం దోహదపడుతుందన్నారు. టాంజానియాలో గల కిలిమంజారో పర్వతాన్ని విజయవంతంగా అధిరోహించిన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యా తండాకు చెందిన యశ్వంత్, అతని తల్లిదండ్రులు, శిక్షకులను హైదరాబాద్ మంత్రుల నివాసంలో సన్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..భవిష్యత్‌లో ఇలాంటి సాహసోపేత పర్వతారోహణలకు సంపూర్ణ తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. కిలిమంజారో పర్వతం అధిరోహించడం కోసం లక్షన్నర రూపాయలు ఆర్థిక సాయం చేయడంతో యశ్వంత్, ఆయన కుటుంబ సభ్యులు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

జమ్ము కాశ్మీర్ లేహ్ లడక్ ప్రాంతంలోని ఆరు వేల మీటర్ల ఎత్తయిన కహర్ డుమ్లా పర్వతశ్రేణిని, కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి రాష్ట్ర ప్రభుత్వ పతాకాన్ని ఎగురవేయడం పట్ల యశ్వంత్‌ను మంత్రి ఘనంగా సన్మానించారు.

ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్ , ఆగష్టు 31: వర్షాల తగ్గే వరకు ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని నబిల్‌కాలనీ, మెట్రోసిటీ కాలనీలో వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను పరిశీలించారు. కాలనీ వాసులతో మాట్లాడారు. సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని ధైర్యం చెప్పారు.

ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంట వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్ జి.పి కుమార్‌కు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. అధికారులు, ప్రత్యేక పారిశుధ్య సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తెలిపారు. మంత్రి వెంట స్థానిక కౌన్సిలర్లు అహ్మద్ కసాది, జాఫర్ భామ్, జింకల రాధిక, శంషోద్ధీన్, నాయకులు ఇక్బాల్ బిన్ ఖలీఫా, యూసుఫ్ పటేల్, శ్రావణ్‌కుమార్‌లు ఉన్నారు.

దళితబంధు సర్వే.. దమ్మక్కపేటలో పర్యటించిన మంత్రి గంగుల

హుజురాబాద్, ఆగష్టు 31:హుజురాబాద్ పట్టణంలోని దమ్మక్క పేటలో పర్యటించారు. శోభమ్మ- బొందయ్య ఇంటికి వెళ్లి వారితో కూర్చుండి దళిత బంధు పథకం పై వారికి అవగాహన కల్పించారు..ఈ సందర్భంగా మంత్రి వారితో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి దళిత కుటుంబం ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు? దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఈ దళిత బంద్ కార్యక్రమం తీసుకొచ్చారని వివరించారు.

దళితబంధు లబ్ధిదారులంతా ఒకేవ్యాపారంపై దృష్టి సారించకుండా అధికారుల సూచనలతో వివిధ రంగాలపై మెళకువలు నేర్చుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు? కేసీఆర్ పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, దళిత బంధు పథకం లో ఇచ్చిన పది లక్షలను ఏడాదిలోగా 20 లక్షలు చేసి చూపించాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి దమ్మక్క పేట లోని దళిత కాలనీలో కాలినడకన తిరుగుతూ వారి వివరాలు సేకరించారు. ప్రతి కుటుంబానికి దళిత బంధు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎవరూ ఆందోళన చెందవద్దని మంత్రి తెలిపారు

ఏపీలో మరోసారి పెరిగిన కరోనా కేసులు..

అమరావతి, ఆగష్టు 31:ఏపీలో కరోనా మహమ్మారి ఎక్కడా తగ్గడం లేదు. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో 52,319 శాంపిల్స్‌ను టెస్ట్ చేయగా 1115 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్య 20,14,116కి చేరింది. ఇందులో 19,85,566 మంది ఇప్పటికే కోలుకొని డిశ్చార్జ్ కాగా, 14,693 కేసులు యాక్టీవ్‌గా ఉన్నాయి. ఇక గడిచిన 24 గంటల్లో ఏపీలో కరోనాతో 19 మంది మృతి చెందారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు కరోనాతో 13,857 మంది మృతి చెందారు. గడిచిన 24 గంటల్లో ఏపీలో కరోనా నుంచి 1265 మంది కోలుకొని డిశ్చార్జ్ అయ్యారు. చిత్తూరులో 210, గుంటూరులో 121, కృష్ణాలో 165, నెల్లూరులో 120, ప్రకాశంలో 121, పశ్చిమ గోదావరి జిల్లాలో 125 కేసులు నమోదయ్యాయి. కరోనా మహమ్మారి నుంచి బయటపడాలి అంటే వ్యాక్సిన్ తీసుకోవడం ఒక్కటే మార్గం కావడంతో వేగంగా వ్యాక్సిన్‌ను అమలు చేస్తున్నారు. వ్యాక్సినేషన్ అమలు చేస్తున్నా కేసులు పెరుగుతుండడంతో తప్పని సరిగా నిబంధనలు పాటించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తున్నది.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణే అగ్రగామి : ఎమ్మెల్యే అరూరి రమేశ్

జమ్మికుంట రూరల్, ఆగష్టు 31: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలుస్తోందని జమ్మికుంట రూరల్ ఇన్‌చార్జ్, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మంగళవారం జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోరపల్లి గ్రామంలో ఉన్న పెండింగ్ పనులైన సీసీ రోడ్లకు, డ్రైనేజీ, కమ్యూనిటీ భవనాలకు కోటి ఇరవై మూడు లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. త్వరితగతిన ఆ పనులను కూడా పూర్తి చేసుకుంటామన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు గడపగడపకు వెళ్లి బొట్టు కార్యక్రమాన్ని చేపట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వాళ్లకు వివరిస్తూ టీ అర్ ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్ ను భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, గ్రామ సర్పంచ్ గిరివేని రమ-రాజయ్య, ఎంపీటీసీ కడవేరుగు మమత ? మోహన్, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంత అసమర్థంగా బలగాల ఉపసంహరణ చరిత్రలో చూడలేదు: డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, ఆగష్టు 31: ఆఫ్ఘనిస్థాన్ నుంచి అమెరికా తన బలగాలను ఉపసంహరించిన తీరు చాలా అసమర్థంగా ఉన్నదని ఆ దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. ఇలాంటి దారుణమైన ఉపసంహరణ ప్రక్రియను తాను చరిత్రలో ఏ యుద్ధంలోనూ చూడలేదని బైడెన్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆఫ్ఘన్ గడ్డపై 20 ఏండ్ల సుదీర్ఘ యుద్ధానికి ముగింపు పలుకుతూ అమెరికా బలగాల చిట్టచివరి విమానం సోమవారం కాబుల్ నుంచి బయలుదేరి అగ్రరాజ్యానికి చేరుకుంది.

ఈ నేపథ్యంలో బైడెన్ సర్కారు తీరుపై మాజీ అధ్యక్షుడు ట్రంప్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆఫ్ఘన్‌లో ఉన్న అన్ని అమెరికా సైనిక పరికరాలను తిరిగి తీసుకురావాలని, యుద్ధంలో అమెరికా ఖర్చు చేసిన 85 బిలియన్ డాలర్లలో ప్రతిపైసా తిరిగి తెచ్చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తాలిబన్‌లు సైనిక పరికరాలను తిరిగివ్వకపోతే మళ్లీ సైన్యాన్ని పంపాలని, లేదంటే బాంబులేసి వాటిని నాశనం చేయాలని సూచించారు. ఇలాంటి బలహీనమైన, మూర్ఖత్వపు ఉపసంహరణ ప్రక్రియను ఎవరూ ఊహించలేదన్నారు.

జెండా పండుగను జయప్రదం చేయాలి : మంత్రి గంగుల

కరీంనగర్ ఆగష్టు 31:(నేటినిజం ప్రతినిధి): టీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు సెప్టెంబర్ 2న నిర్వహించే పార్టీ జెండా పండుగను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు గంగుల కమలాకర్ ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో కరీంనగర్ నియోజకవర్గంలోని నగర మేయర్, డిప్యూటీ మేయర్, కొత్తపల్లి చైర్మన్ కరీంనగర్, కొత్తపల్లి మండలాలకు చెందిన టీఆర్ఎస్ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, కో ఆప్షన్, జడ్పిటీసీలతో సమావేశం నిర్వహించారు.

ఈ సంధర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సారధ్యంలో ఎన్నో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజల మన్ననలు పొందిన చరిత్ర కేవలం టీఆర్ఎస్ పార్టీకే దక్కిందన్నారు. 2023 లో 100 సీట్లతో అధికారమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పార్టీకోసం కష్టపడాలని పిలుపునిచ్చారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రజాప్రతినిధులు కష్టపడాలని పిలుపునిచ్చారు.

ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. 70శాతం ప్రజలు టీఆర్ఎస్ వైపే ఉన్నారని, ప్రభుత్వానికి పార్టీకి వారధిగా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు పార్టీ నాయకులతో సమన్వయం చేసుకొని వార్డు, డివిజన్, గ్రామ కమిటీలను వేసుకోవాలని తెలిపారు.

నియోజకవర్గంలోని మున్సిపల్ కార్పొరేషన్, కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు అన్ని గ్రామాలలో సెప్టెంబర్ 2న, జెండా పండుగను ఒక పండుగ వాతావరణం లో జరపడానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కేసీఆర్ నేతృత్వంలో ఒక ఉప్పెనలా మొదలైన టీఆర్ఎస్ రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో ఈనాడు ఢిల్లీలో సైతం కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకునే స్థాయికి ఎదగడం ఎంతో గర్వకారణం అన్నారు.గల్లీ నుంచి ఢిల్లీ వరకు గులాబీ జెండాను ఎగురవేసి టీఆర్ఎస్ పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో నగర మేయర్ వై సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, జడ్పీటీసీలు పురమల్ల లలిత, పిట్టల కరుణ, ఎంపీపీలు పిల్లి శ్రీల , తిప్పర్తి లక్ష్మయ్య, కో ఆప్షన్ సభ్యులు సాబీర్ పాషా, మాజీ ఎంపీపీ వాసాల రమేష్, మాజీ జిల్లా కో-ఆప్షన్ సభ్యులు జమీలుద్దీన్, కరీంనగర్, కొత్తపల్లి మండల అధ్యక్షులు కాసారావు శ్రీనివాస్ గౌడ్, కరీంనగర్ ప్యాక్స్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి , దుర్షెడ్ ఫ్యాక్స్ చైర్మన్ బల్మూరి ఆనందరావు కాశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశ్చిమబెంగాల్‌లో బీజేపీకి మరో ఎదురుదెబ్బ

కోల్‌కతా, ఆగష్టు 31:: పశ్చిమ బెంగాల్‌లో ప్రతిపక్ష భారతీయ జనతాపార్టీకి దెబ్బమీద దెబ్బ పడుతూనే ఉంది. ఇప్పటికే ఎమ్మెల్యేలు ముకుల్ రాయ్, తన్మయ్ ఘోష్‌లు బీజేపీని వీడి తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా మరో ఎమ్మెల్యే విశ్వజిత్ దాస్ కూడా పార్టీని వీడటంతో.. బీజేపీకి మరో ఎదురుదెబ్బ తగిలినట్లయ్యింది. ఎమ్మెల్యే విశ్వజిత్ దాస్‌తోపాటు బీజేపీ కౌన్సిలర్ మనోతోస్ నాథ్ కూడా బీజేపీని వీడి తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు.

ఈ సందర్భంగా విశ్వజిత్ దాస్ మాట్లాడుతూ.. బీజేపీలో కొన్ని జరుగ కూడని మార్పులు జరిగాయని, ఈ విషయంలో పార్టీలో అపార్థాలు పొడసూపాయని, అందుకే తాను ఆ పార్టీని వీడి సొంత గూటికి చేరానని చెప్పారు. విశ్వజిత్ దాస్‌తో కలిపి గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం తృణమూల్‌లో చేరిన బీజేపీ ఎమ్మెల్యేల సంఖ్య మూడుకు చేరింది. ఇప్పటికే ముకుల్ రాయ్ బీజేపీని వీడగా, సోమవారం విష్ణుపూర్ ఎమ్మెల్యే తన్మయ్ ఘోష్ కూడా ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు.

106 వ రోజుకు చేరుకున్న అన్నదానం

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 31(నేటినిజం ప్రతినిధి) మైవేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చేపడుతున్న నిత్యాన్నదాన కార్యక్రమాలు మంగళవారం నాటికి 106 .వ రోజుకు చేరుకుంది. మంగళవారం అన్నదాన కార్యక్రమము లక్ష్మీ గణపతి కాంప్లెక్స్ ముందు భాగంలో ఉన్న అన్నార్థులకు, యాచకులకు, భీమేశ్వరాలయం వద్ద మరియూ పార్కింగ్ స్థలంలో ఉన్న యాచకులకు, అన్నర్థులకు మొత్తం దాదాపు 75 మందికి అన్నప్రసాద వితరణ కార్యక్రమం 106 రోజులుగా నిరంతరాయంగా నిర్వహించడం జరుగుతుంది. నిత్యాన్నదానం చేస్తున్న క్రమంలో నేటి అన్నదాతలుగా నగుబోతు రవీందర్, రొక్కం నర్సింహారెడ్డి, పెద్ది రాజు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కొమురవెల్లి సంతోష్ మరియు వారి కుటుంబ సభ్యులు. దాతలు అందించిన విరాళాలతో 365 రోజులు అన్నదానం చేయాలనే లక్ష్యం ముందుకు సాగడం జరుగుతుందని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. అన్నదానం మహాదానం.ఈ కార్యక్రమంలో మైవేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నాగుల చంద్రశేఖర్, తాళ్లపెల్లి ప్రశాంత్, కొప్పుల హన్మాండ్లు,భస్మాంగి బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సమేతంగా రాజన్న ను దర్శించుకున్న శంషాబాద్ డిసిపి ప్రకాష్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 31:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లో గల శ్రీ పార్వతి రాజరాజేశ్వరి స్వామి వారి ఆలయాన్ని మంగళవారం హైదరాబాద్ శంషాబాద్ డిసీపి. ఎన్. ప్రకాష్ రెడ్డి కుటుంబ సమేతంగా వచ్చి

స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. తదనంతరం నాగిరెడ్డి మండపం లో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసినారు..ఆలయ పి ఆర్ ఓ ఉపాధ్యాయుల చంద్రశేఖర్ శాలువ కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు.డిసిపి వెంట స్థానిక డిఎస్పీ సిఐ చంద్రకాంత్ , వెంకటేష్ లు ఉన్నారు.

నేరాల నియంత్రణలో భాగంగా బైండోవర్లను కొనసాగిస్తున్న కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు

కరీంనగర్ ఆగష్టు 31:(నేటినిజం ప్రతినిధి): అక్రమ కార్యకలాపాల నియంత్రణ, నేరాలు జరుగకుండా ముందస్తు చర్యలు, అల్లర్లు సృష్టిస్తారనే అనుమానం ఉన్న వ్యక్తులను సంబంధిత తహసిల్దార్‌ల ఎదుట బైండోవర్ చేసే పక్రియకు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు కొనసాగిస్తున్నారు. తొలుత నిషేదిత పొగాకు ఉత్పత్తులను విక్రయించేవారితో పాటుగా అల్లర్లు సృష్టిస్తారనే అనుమానం ఉన్న వ్యక్తులను బైండోవర్ చేయనున్నారు. ఆ తర్వాత ఒకటిరెండుసార్లు వివిధ రకాల నేరాల్లో పట్టుబడి మళ్ళీ నేరాలను పాల్పడుతారనే అనుమానం ఉన్న వ్యక్తులను బైండోవర్ చేయనున్నారు. బైండోవర్ చేసేముందు గతంలో వారి నేరచరితను క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోనున్నారు.

హుజురాబాద్ నియోజకవర్గంలో ప్రస్తుతం ఎన్నికల వాతావరణం నెలకున్న నేపథ్యంలో గతంలో జరిగిన ఎన్నికల సందర్భంగా అల్లర్లు సృష్టించి కేసులు నమోదైన వ్యక్తులను బైండోవర్ చేస్తున్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాల్లోని నేరచరితుల కదలికపై నిరంతరం నిఘా కొనసాగుతున్నది. బైండోవర్ కాబడిన వ్యక్తులు నిర్ణీత కాలపరిమితిలోపు మళ్ళీ ఏదైనా నేరసంఘటనకు పాల్పడినట్లయితే బైండౌన్ చేయనున్నారు. బౌండౌన్ అయిన వారికి 06నెలల వరకు జైలుశిక్ష, ఒకలక్ష రూపాయల జరిమానా లేదా కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో రెండునూ విధించబడే అవకాశాలు ఉన్నాయి.

అక్రమ కార్యకలాపాల నియంత్రణపై దూకుడు పెంచిన పోలీసులు

అక్రమ కార్యకలాపాలను నియంత్రించే చర్యల్లో భాగంగా కమిషనరేట్ పోలీసులు ఈ మధ్యకాలంలో దూకుడును పెంచిన విషయం విదితమే. ఇందులో భాగంగా అక్రమంగా రవాణా అవుతున్న పిడిఎస్ బియ్యం, నిషేదిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుంటూ నిందితులపై చర్యలు తీసుకుంటున్నారు. అక్రమ కార్యకలాపాల నియంత్రణ కోసం వివిధ విభాగాలకు చెందిన పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ఏర్పచుకున్న సమాచారవ్యవస్థద్వారా అందిన సమాచారం మేరకు పోలీసులు ఆయా ప్రాంతాలకు చేరుకుని దాడులను నిర్వహిస్తారు. అనంతరం నిందితులను సంబంధిత పోలీస్ స్టేషన్లలో అప్పగించి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడే నిందితులు, అనుమానితులను గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ముందుకుసాగుతున్నారు. కిరాయి మూకాలు, దౌర్జన్యాలు, రౌడీచరలను సహించబోమని పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ వివిధ సందర్భాలలో హెచ్చరిస్తున్న విషయం విదితమే. అక్రమ కార్యకలాపాల నియంత్రణతోపాటు పలు ముందస్తు చర్యలు తీసుకోవడం, నేరాల ఛేదనే లక్ష్యంగా ప్రత్యేక పోలీసు బృందాలను మరింత పటిష్టం చేస్తున్నారు.

చెరువులకు పూర్వకళ ఘనత కేసీఆర్‌దే- ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

హైదరాబాద్ , ఆగష్టు 31: తెలంగాణ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత చారిత్రాత్మక చెరువులకు పూర్వకళను తీసుకువచ్చిన ఘనత టీఆర్ఎస్ సర్కారుకే దక్కిందని రాజేంద్రనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు టి.ప్రకాష్‌గౌడ్ స్పష్టంచేశారు. గండిపేట చెరువు కట్టపై హెచ్‌యండీఏ ఆధ్వర్యంలో రూ.27 కోట్ల నిధులతో నిర్మిస్తున్న పరివాహక సుందరీకరణ పనులను మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు కట్టపై నిర్మిస్తున్న ఎంట్రన్స్? ప్లాజా, టికెట్ రూం, గార్డ్ రూం, సెంట్రల్ పెవిలియన్, ఓఏఏటీ(ఆర్ట్ పెవిలియన్), టాయిలెట్స్?, కిడ్స్? ప్లేయింగ్, పార్కు నిర్మాణాల వివరాలను హెచ్‌యండీఏ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేసి, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం చెరువు కట్టపైకి వెళ్లిన ఎమ్మెల్యే నీటిమట్టం వివరాలను జలమండలి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత చారిత్రాత్మక చెరువులకు పూర్వకళను తీసుకువచ్చిందన్నారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో భవిష్యత్తు తరాలకు ఉజ్వళమైన భవిష్యత్తును అందించాలన్న సంకల్పంతో వందేళ్లు పూర్తిచేసుకున్న గండిపేట చెరువుకు పర్యాటక శోభను తీసుకువచ్చేందుకు ప్రత్యేక చొరవచూపుతున్నారని తెలిపారు.ఏడేళ్లకాలంగా టీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగుతుందని, ఏనాడు ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా సర్కారు చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతియేటా ప్రజల ఆశీస్సులతో పుష్కలమైన వర్షాలను భగవంతుడు అందిస్తూ అన్నదాతల నుంచి అన్నివర్గాల వారు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని అన్నారు. నగరవాసులకు దాహార్తి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ఇప్పటికే గోదావరి, కృష్ణా జలాలను సర్కారు తీసుకువచ్చి అందిస్తుందన్నారు. జంట జలాశయాలైన గండిపేట, హిమాయత్‌సాగర్‌లు నిండుకుండలా అందుబాటులో తాగునీటితో సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రజలకు మరో ఐదేళ్ల వరకు నీటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.గండిపేట చెరువు కట్టపై రూ. 27 కోట్ల నిధులతో హెచ్‌యండీఏ చేపట్టిన సుందరీకరణ పనులు డిసెంబర్ నాటికి పూర్తయి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. భవిష్యత్తులో గండిపేటలో వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లను చెరువు చుట్టూ ఏర్పాటు చేసే దిశగా సర్కారు యోచిస్తుందన్నారు.

శతాబ్ది ఉత్సవాలలో భాగంగా పనులను పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ దారుగుపల్లి రేఖయాదగిరి, వైస్ చైర్మన్ జి.వెంకటేష్‌యాదవ్, హెచ్‌యండీఏ ఈఈ పద్మ,డీఈ దేవేందర్‌రెడ్డి, ఏఈ జీవన్, కౌన్సిలర్లు విజేతప్రశాంత్‌యాదవ్, సునీతగణేష్‌కుమార్, శివారెడ్డి, ఆదిత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 31:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో లయన్స్ క్లబ్ వారు లయన్ సా మ వీర రమణయ్య జన్మదిన సందర్భంగా రాజన్న గుడి పరిసర ప్రాంతంలోని యాచకులకు అన్నదానం చేశారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ గత కొద్దిరోజుల నుండి లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు .లయన్ సామ వీర రమణయ్య జన్మదిన సందర్భంగా సోమవారంపలు పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులకు కరోనా సోకకుండా ముందస్తుగా మాస్కుల. శానిటైయిజర్స్ పంపిణీ చేస్తామని అలాగే మంగళవారం అన్నదానం చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి .రాజశేఖర్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు,

చందుర్తి మండలంలో భారీ వర్షం

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 31:(నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలంలో సోమవారం నుండి మంగళవారం వరకు భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో మండలంలోని చెరువులోకి. కుంట లో కి నీరు చేరింది. మండలంలో రామన్నపేట ఊర చెరువు నిండి మత్తడి దూకుతుంది. అలాగే బండపల్లి ఊర చెరువులోకి సమృద్ధిగా నీళ్ళు వస్తున్నాయి. అలాగే ఎన్గల్ గ్రామంలో భారీ వర్షాలకు ఒర్రే ప్రవహిస్తూ కల్వర్టు పొంగి ప్రవహించడం కనిపించింది. మిగతా గ్రామాల్లో లో కూడా వర్షాలకు చెరువులు నిండాయి. కొన్ని గ్రామాల్లో వర్షానికి పంటలు నీటమునిగాయి. భారీ వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తగా ఉండాలని ఎస్సై సునీల్ సూచించారు,

భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పశువుల మేత, చేపలు పట్టడం కోసం ప్రజలు వెళ్లవద్దు

- వేములవాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్

వేములవాడ ఆగష్టు 31:(నేటినిజం ప్రతినిధి): గత రెండు మూడు రోజుల నుండి భారీ వర్షాలు కురవటం రానున్న రెండు మూడు రోజులు కూడా వర్షాలు ఉండటం తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ పశువుల మేత ముఖ్యం గా గొర్రెలు, మేకలు వంటి జీవుల మేతకోసం వాగులు వరదలు వచ్చే ప్రాంతాలకి వెళ్లి అనవసరం గా ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని అదే విధంగా చేపల వేటకు ప్రజలు, జాలరులు వెళ్ళవద్దని విజ్ఞప్తి చేశారు. వర్షాల ద్వారా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని పట్టణ పరిధిలో గ్రామాలకు గల విలేజ్ పోలీస్ ఆఫీసర్ లను ఆయా ఆయా గ్రామాలలో వాగులు,వరదల ఉధృతి గురించి మరియు భారీ వర్షాల వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని అదే విధంగా సోషల్ మీడియా ద్వారా కూడా ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం అని తెలిపారు.ఏమైనా సంఘటనలు జరిగినా, ప్రమాదం జరిగే అవకాశం వున్నా వెంటనే పోలీస్ స్టేషన్ (డయల్ 100)కు సమాచారం ఇవ్వగలరు.

నిజామాబాద్ జిల్లాలో వింత.. రెండు తలలతో పుట్టిన గొర్రె పిల్ల

నిజామాబాద్, ఆగష్టు 31: నిజామాబాద్ జిల్లాలో ఓ గొర్రె రెండు తలల పిల్లకు జన్మనిచ్చింది. జక్రాన్‌పల్లి మండల కేంద్రానికి చెందిన తొగరి లక్ష్మణ్‌కు గొర్రెల మంద ఉంది.

ఈ మందలోని ఓ గొర్రె ప్రసవించింది. ఆ గొర్రెకు పుట్టిన పిల్ల వింతగా రెండు తలలతో జన్మించింది. వింతగా జన్మించిన గొర్రె పిల్లను చూసేందుకు జనాలు తరలివస్తున్నారు. జన్యు లోపంతోనే ఈ రకంగా జన్మించి ఉండొచ్చని పశు వైద్య అధికారులు చెబుతున్నారు.

వినియోగదారుల మద్యపాన ప్రాధాన్యత నందిస్తూ జాతీయ బ్రాండ్లను సైతం అందుబాటులో ఉంచాలి

హైదరాబాద్ , ఆగష్టు 31:నిషేదం నుంచి నియంత్రణ దిశగా తమ నూతన మద్య విధానాన్ని ప్రకటించిన ఆంధ్రప్రదేశ్ (ఏపీ) ప్రయత్నాలను (ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఎన్‌డబ్ల్యుఏఐ) స్వాగతించడంతో పాటుగా ఆంధ్రప్రదేశ్ వాసులకు భారతదేశంలో తయారైన విదేశీ మద్యం సైతం అందుబాటులో ఉంచాల్సిందిగా ఏపీ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఆంధ్రప్రదేశ్ వాసులతో పాటుగా రాష్ట్రానికి వచ్చే పర్యాటకులకు ఇది విస్తృతశ్రేణి అవకాశాలను తీసుకువస్తుంది.శ్రీమతి నీతా కపూర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,ఐఎన్‌డబ్ల్యుఏఐ మాట్లాడుతూ " ప్రగతిశీల పర్యాటక విధానం ఇప్పుడు తక్షణావస్యకం. ఆల్కోబేవ్ పరిశ్రమ ఇప్పుడు పర్యాటక, యాత్రా పరిశ్రమల అభివృద్ధికి అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుంది. పర్యాటక ప్రాంతాలలో తెరిచే నూతన మద్యం షాప్‌లను ఆంధ్రప్రదేశ్ టూరిజం హోటల్స్ అండ్ రిసార్ట్స్ నిర్వహించనున్నట్లుగా ఇప్పటికే పర్యాటక శాఖ ప్రతిపాదనలు పంపింది.

దీని కారణంగా ప్రభుత్వానికి గణనీయంగా ఆదాయం లభించడంతో పాటుగా ఆర్థికావకాశాలూ కలుగుతాయి. ఈ కారణం చేత భారతదేశంలో తయారైన విదేశీ మద్యం బ్రాండ్లను స్థానిక మరియు పర్యాటకుల కోసం అందుబాటులో ఉంచాల్సిన ఆవశ్యకత ఉంది. తద్వారా విస్తృత శ్రేణి అవకాశాలు, అత్యున్నత వినియోగదారుల అనుభవాలనూ అందించడం వీలవుతుంది. అంతేకాకుండా పర్యాటక వాతావరణం అభివృద్ధి చేసి, ప్రచారం చేసేందుకు సైతం అతి కీలకమైన పాత్రను పోషిస్తుంది" అని అన్నారు. కేరళ రాష్ట్ర అనుభవాలను పరిగణలోకి తీసుకుని వాటి నుంచి మనం నేర్చుకోవాల్సిన అవసరమూ ఉంది. అక్కడ ఆల్కోబేవ్ రంగ అమ్మకాలను నిషేదించడంతో రాష్ట్ర ఆదాయం గణనీయంగా పడిపోవడంతో పాటుగా జాతీయ మరియు అంతర్జాతీయ పర్యాటకుల రాక కూడా తగ్గిపోయింది. తద్వారా పరిశ్రమ విలువ శ్రేణిలో ఎంతో మంది ఉద్యోగాలనూ కోల్పోయారు. మరీ ముఖ్యంగా హాస్పిటాలిటీ, హోటల్ రెస్టారెంట్, కేఫ్ (హోరెకా) రంగంలో ఈ ఉపాధి అవకాశాలు కోల్పోడం గణనీయంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇప్పుడు అతి ముఖ్యమైన పారిశ్రామిక మరియు పర్యాటక ప్రాంతంగా నిలువాలనుకుంటుంది. ఈ నేపథ్యంలో కేరళ ఆల్కోబేవ్ రంగ అనుభవాల పాఠాలనూ నేర్వాల్సి ఉంటుంది. వినియోగదారులు తమంతట తాముగా తాము వినియోగించే ఉత్పత్తులను ఎంచుకునేందుకు తగిన ఉత్పత్తులను అందుబాటులో ఉంచాల్సిన ఆవశ్యకతను సురేష్ మీనన్, సెక్రటరీ, జనరల్ ఐఎన్‌డబ్ల్యుఏఐ వెల్లడిస్తూ " నూతన స్థానిక బ్రాండ్లు మరియు ఎన్నో సంవత్సరాలుగా ఉన్నటువంటి సుప్రసిద్ధ జాతీయ బ్రాండ్ల నడుమ వివక్షను రాష్ట్ర ప్రభుత్వం చూపరాదు. చాలా వరకూ జాతీయ బ్రాండ్లు కూడా స్థానికంగా, రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతున్నాయి. వినియోగదారుల ప్రాధాన్యతలకు తగిన అవకాశాలను ఇవ్వక పోవడం వల్ల అక్రమంగా మద్యం తరలించడం, సకిలీ మద్య విక్రయాలు పెరగడం, స్మగ్లింగ్ చేయడం సహా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు పెరుగుతాయి. రాష్ట్ర ఆదాయంపై ప్రభావంపడటంతో పాటుగా వినియోగదారులకూ అది నష్టం చేస్తుంది" అని అన్నారు. ఆయనే మాట్లాడుతూ "దేశంలో చాలా రాష్ట్రాలకు లాగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పన్ను ఆదాయంకు గణనీయమైన తోడ్పాటును ఏపీ ఆల్కోబేవ్ పరిశ్రమ అందిస్తుంది. నిజానికి ఆల్కోబేవ్ రంగ ఆదాయం పైనే ప్రభుత్వం అధికంగా ఆధారపడింది. బహుళ కోణాలో ఆర్థికాభివృద్ధికి తోడ్పడే అపార సామర్థ్యం ఈ పరిశ్రమకు ఉంది. సహకారయుక్త మరియు సమ్మిళిత వాతావరణంను భారతీయ తయారీ విదేశీ మద్యం తయారీదారులందరికీ అందించడం కీలకం. తద్వారా రాష్ట్ర ఆదాయం మెరుగుపడటంతో పాటుగా సానుకూల వ్యాపార వాతావరణమూ రాష్ట్రంలో సృష్టించడం వీలవుతుంది'' అని అన్నారు. బాధ్యతాయుతంగా మద్యం సేవించాల్సిన ఆవశ్యకత , దానిని ప్రోత్సహించడానికి కట్టుబడిన ఐఎన్‌డబ్ల్యుఏఐ నిబద్ధతను గురించి నీతా కపూర్ మాట్లాడుతూ " పర్యాటక రంగంను ప్రోత్సహించడానికి దశలవారీ మరియు బాధ్యతాయుతమైన మద్య సేవన విధానం అత్యంత కీలకం. బాధ్యతారహితంగా మద్యం సేవించడం, ఆల్కహాల్ వేధింపుల సమస్యలను తీర్చేందుకు నియంత్రణ విధానం అనేది బాధ్యతాయుత మద్యపారం పట్ల దీర్ఘకాలిక అవగాహన, విద్యా కార్యక్రమాలతో పాటుగా ఉండాల్సిన అవసరం ఉంది. ఈ అతి ముఖ్యమైన కార్యక్రమం పట్ల ఏపీ ప్రభుత్వంతో చేతులు కలిపేందుకు ఐఎన్‌డబ్ల్యుఏఐ ఆసక్తిగా ఉంది'' అని అన్నారు. ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్

రేడియో సిటీ సూపర్ సింగర్ 13 ఆడిషన్స్ ప్రారంభం

హైదరాబాద్ , ఆగష్టు 31:భారతదేశంలోని ప్రముఖ రేడియో నెట్‌వర్క్, రేడియో సిటీ సూపర్ సింగర్ 13వ సీజన్‌ను ప్రకటించింది. ఇది ఒక దశాబ్దానికి పైగా మిలియన్ల మంది భారతీయులను అలరిం చింది. ఈ కార్యక్రమం 39 నగరాల్లోని ఔత్సాహిక గాయకులకు అతిపెద్ద వేదికలలో ఇది ఒకటిగా నిలిచింది. ఆడిషన్స్ ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 12 వరకు జరగనుంది. 'మీ అత్యుత్తమ షాట్ పాడటానికి సమయం ఆసన్నమైంది' అనే ట్యాగ్‌లైన్‌తో, ఐవీఆర్ఎస్, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ రేడియో సిటీ మైక్రోసైట్ ద్వారా ఆడిషన్ ప్రక్రియ కొనసాగనుంది. సెప్టెంబర్ 25న ప్రసారం కానుంది. సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్ న్యాయమూర్తిగా, మార్గద ర్శకుడిగా ఉంటారు. ఆడిషన్ ప్రక్రియ ఈ సంవత్సరం వరుసగా హిందీ, తమిళ, తెలుగు, కన్నడ మాట్లాడే ప్రాంతాల నుంచి ఆరుగురు ప్రతిభావంతులైన అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి, సూపర్ గ్రాండ్ ఫైనల్ చేయనున్నారు. ఫైనల్ విజేతను చైతన్ భరద్వాజ్, పబ్లిక్ ఓటింగ్ ద్వారా ఎంపిక చేస్తారు.ఈ సందర్భంగా రేడియో సిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అషిత్ కుకియాన్ మాట్లాడుతూ రేడియో సిటీలో యువత ఊహలను ఆకర్షించే వినూత్న కంటెంట్‌తో ఎల్లప్పుడూ మా ప్రేక్షకుల పల్స్‌ను ఆకర్షించగలుగుతున్నామన్నారు. రేడియో సిటీ సూపర్ సింగర్‌తో మా గత విజేతలు ప్రదర్శించినట్లుగానే, సంగీత పరిశ్రమలో ఒక మార్క్‌ను సృష్టిస్తుందని విశ్వసిస్తున్నామని పేర్కొన్నారు. భారతదేశంలో అత్యుత్తమ గాన ప్రతిభను అందించడానికి మేము కట్టుబడి ఉన్నామని తెలిపారు. సంవత్సరాలుగా లక్షలాది మందిని చేరుకోవడంలో రేడియో సిటీ సూపర్ సింగర్ సక్సెస్ అయ్యిందన్నారు. టాలెంట్ షోల జాతీయ బెంచ్‌మార్క్, అద్భుతమైన సీజన్‌తో దాని వారసత్వాన్ని నిలబెట్టడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. నిరంతరం అభివృద్ధి చెందాలని, అది ఉత్తమంగా చేయడాన్ని స్వీకరించాలని విశ్వసించే బ్రాండ్‌గా మా లెక్కలేనన్ని నమ్మకమైన శ్రోతలను అలరి స్తుందన్నారు. సీజన్ 13 మునుపెన్నడూ లేనంత గొప్పగా ఉంటుందన్నారు. మంచి సంగీత వేడుక, దాని ట్యాగ్‌లైన్‌కి అనుగుణంగా, 'రేడియో సిటీ సూపర్ సింగర్ సీజన్ 13 లో మీ అత్యుత్తమ షాట్ ఇవ్వడానికి సమయం వచ్చింది'అన్నారు. ఈ సందర్భంగా చైతన